క్లుప్తంగా

వర్షం కోసం గంగమ్మకు పూజలు


గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం కొండపై వెలసిన గుంటి గంగమ్మకు గ్రామస్తులు సోమవారం పాలాభిషేకం చేశారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి సామూహికంగా పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. గుంటి గంగమ్మ అనుగ్రహం కోసం ఏటా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో భాద్రపద మాసం సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సంజామల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారు. డోన్‌లో గత నెల 30,31వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు తాప్సీ, గురు హర్షిత, తొమ్మిదో తరగతి విద్యార్థినులు కీర్తన, యాద్విత ప్రతిభ చాటారు. అండర్ 17,14,12 విభాగాల్లో తాప్సీ గోల్డ్ మెడల్, గురు హర్షిత సిల్వర్, కీర్తన, యాద్విత బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న హనుమాన్‌నాయక్

కోవెలకుంట్ల: వెలుగు పథకం ద్వారా వివిధ రుణాలను మంజూరు చేసి మహిళలను ఆర్థిక బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆ పథక డీపీఎం ఐబీ హనుమాన్‌నాయక్, డీపీఎం హెచ్‌డీ పుణ్యవతి సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మనడబ్బులు-మన లెక్కలు అనే కార్యక్రమంపై కోవెలకుంట్ల ఏపీఎం శేఖర్ అధ్యక్షతన క్లస్టర్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ-నారీ, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, వీపీఆర్‌డీ, జీవనోపాధి, లోకస్, ఎంసీఎల్ఎఫ్, తదితర అంశాలపై ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లకు వివరించారు. రుణాలు పొందిన పొదుపు మహిళలు జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. వెలుగు పథక అధికారులు బాబురావు, ఎల్లయ్య, దొర్నిపాడు ఏపీఎం బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని షాదిఖానాలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ జీవితం, సందేశాలపై సంఘం అధ్యక్షుడు షేక్ ఖాజా హుసేన్, కార్యదర్శి కరిముల్లా పోటీలను నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు షేక్ ఉసేన్, షేక్షా, మహబూబ్ వలి, సద్దామ్, అక్బాబ్, రహిమాన్ పాల్గొన్నారు.

విజ్ఞానం.. ప్రోత్సాహం

- విద్యార్థి విజ్ఞాన మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 30వ తేదీ రిజిస్ట్రేషన్లకు చివరి గడువు
- మూడు విడతల్లో పరీక్ష
- ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఉపకార వేతనం


ప్రయోగశాలలో విద్యార్థులు

బనగానపల్లె రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది విద్యార్థి విజ్ఞాన మంథన్ (VVM) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తోంది. 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులు. ఈ పరీక్షల ద్వారా ఎంపికయ్యే విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, బీఏఆర్‌సీ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ప్రత్యేక శిక్షణ లభిస్తుంది. అదనంగా, నెలకు రూ.2 వేల చొప్పున వార్షికంగా రూ.24 వేల ఉపకార వేతనం కూడా అందించనున్నారు.

జూనియర్, సీనియర్ విభాగాల్లో పరీక్షలు

పరీక్షలు జూనియర్, సీనియర్ విభాగాల్లో జరుగుతాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పరీక్ష రాయొచ్చు. పాఠశాల స్థాయిలో జరిగే పరీక్షల తర్వాత రాష్ట్రస్థాయికి తరగతుల వారీగా 150 మందిని ఎంపిక చేస్తారు. ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున 18 మందిని జాతీయ స్థాయికి పంపుతారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.5 వేల నుంచి రూ.2 వేల నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.25 వేలు వరకు నగదు బహుమతులు, ఏడాది పాటు ఉపకార వేతనం, మూడు వారాలపాటు ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ లభిస్తుంది. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు. చివరి తేదీ సెప్టెంబరు 30.

సిలబస్

సెక్షన్-1లో విజ్ఞాన రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు(20 మార్కులు), సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు (20 మార్కులు). సెక్షన్ బీలో 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు సంబంధించి గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు ఉంటాయి(50 మార్కులు). రీజినింగ్ 10 ప్రశ్నలు(10 మార్కులు) ఉంటాయి. ఇందులో ఉత్తీర్ణున వారికి లెవల్-2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు 100 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ పరీక్ష

పరీక్షలు అక్టోబరు 28 నుంచి 30 మధ్య ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మాక్ పరీక్షలు సెప్టెంబరు 1 నుంచి ప్రారంభం కానున్నాయి. లెవల్-1 పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఉత్తీర్ణులైనవారికి నవంబరు 19న లెవల్-2 పరీక్ష ఉంటుంది.

దరఖాస్తు చేసుకోవచ్చు



విజ్ఞాన మంథన్ పరీక్షకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుంది. విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవవచ్చు.

–కుమార్‌బాబు, వీవీఎం జిల్లా కో–ఆర్డినేటర్

మంచి అవకాశం



విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన మంథన్ మంచి అవకాశం. సైన్స్‌పై అభిరుచి పెంచడం, వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు.

–వెంకటరామిరెడ్డి, డోన్ డివిజన్ డిప్యూటీ డీఈఓ

నేడు వైఎస్సార్ వర్ధంతి

డోన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని డోన్‌లోని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంతో పాటు పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం, ఆ తర్వాత బుగ్గన ఇంట్లో మహానేత చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం కోట్లవారిపల్లె, వైఎస్సార్ సర్కిల్‌లోని విగ్రహాలకు పూలమాలలు వేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

కొలిమిగుండ్ల: స్థానిక పార్టీ కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి వర్ధంతి కూడా కావడంతో ఘన నివాళులు అర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె: పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పట్టణంలోని పెట్రోల్ బంక్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా పోతున్న నీరు


పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు


ఎస్ఆర్‌బీసీ వంతెనపై ప్రవహిస్తున్న నీరు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామ పరిధిలోని చెరువుపల్లె రహదారిపై ఉన్న మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోంది. పైప్ లీక్ వల్ల నీరు ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ప్రవహిస్తూ సమీపంలోని ఎస్ఆర్‌బీసీ వంతెన వద్ద కాల్వలోకి చేరుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉండడంతో పాటు రహదారికి కూడా నష్టం వాటిల్లే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

అధికార పార్టీ నాయకుడికి చుక్కెదురు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీలో ఎన్నో ఏళ్లుగా ఉన్న శ్మశానవాటిక అభివృద్ధి పనులు వివాదాస్పదంగా మారాయి. కాలనీవాసులు, దాతల సహకారంతో విరాళాలు సేకరించి అభివృద్ధి పనులు చేపడుతుండగా, అదే కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు భీమేశ్వరరెడ్డి ''మాకు చెప్పకుండా పనులు ఎలా చేస్తారు'' అంటూ వాటిని అడ్డుకున్నారు. దీంతో కాలనీవాసులు, అధికార పార్టీ నాయకుడి మధ్య వాగ్వాదం నెలకొంది. ''మేము మా ఖర్చులతో, దాతల సహకారంతో అభివృద్ధి చేస్తుంటే నీ అనుమతి ఎందుకు తీసుకోవాలి'' అంటూ కాలనీవాసులు ప్రశ్నించడంతో అధికార బలంలో పనులు నిలిపి వేయించాడు. ఈ సమస్యపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి సోమవారం శ్మశానవాటికను సందర్శించారు. కాలనీవాసుల విన్నపాలను విని వారికి అనుకూలంగా స్పందించారు. దీంతో తన రాజకీయ పలుకుబడిని చూపించి పంతం నెగ్గించుకోవాలనుకున్న స్థానిక నాయకుడు చుక్కెదురైన స్థితి ఏర్పడింది.

కిక్కిరిసిన బస్సులు



కొలిమిగుండ్లలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు,అవుకులో బారులు తీరిన ప్రయాణికులు

- ఆలస్యంగా నడిచిన బస్సులు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగకు ఊర్లకు వచ్చిన విద్యార్థులు సోమవారం పాఠశాల, కళాశాలలకు బయలు దేరడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. వందల సంఖ్యలో విద్యార్థులు పాణ్యం, నంద్యాల, కర్నూలు పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే ఆర్టీసీ బస్సుల్లో రద్దీ కనిపించింది. 8 గంటల తర్వాత కొలిమిగుండ్ల, అవుకు బస్టాప్‌లలో పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తూ కనిపించారు. ఉచిత బస్సు కావడంతో విద్యార్థినులను వదిలిపెట్టేందుకు తల్లులు వెళ్లారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొలిమిగుండ్ల మొదలుకొని బెలుం, రామాపురం, చెర్లోపల్లె, అవుకు వరకు బస్టాప్‌లు రద్దీగా మారాయి. వచ్చిన బస్సులన్నీ రద్దీగా ఉండడంతో విద్యార్థులు, మహిళలు ఎక్కలేని పరిస్థితి ఏర్పడింది. గమ్య స్థానానికి చేరేందుకు గంటల సమయం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చిన ప్రతి బస్సులో 80 నుంచి 90 మందికి పైగానే ప్రయాణించారు. బస్సుల్లో రద్దీ నెలకొనడంతో వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కొన్ని బస్సుల్లో లోపలికి చేరుకునేందుకు వీలు పడక చివరకు ఫుట్‌బోర్డు మీద నిల్చొని మహిళలు ప్రయాణించారు. చాలా మంది బస్సుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని తమ పిల్లలను బైక్‌లపై తీసుకెళ్లారు. పండుగలు, సెలవులు, ఇతర ప్రత్యేక రోజుల్లో ఎక్కడికైనా ప్రయాణించాలంటే ఇలాంటి పరిస్థితే ఎదురవుతోందని సాధారణ ప్రయాణికులు అభిప్రాయ పడుతున్నారు.

అల్లర్లకు దూరంగా ఉండాలి


ఆకుమల్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

సంజామల: గ్రామాలు ప్రశాంతంగా ఉండాలంటే మద్యం, బెట్టింగ్, పేకాట వంటి వ్యసనాల్ని దూరం పెట్టాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. మండలంలోని ఆకుమల్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మద్యం మత్తులో జరిగే గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు అల్లర్లకు దారితీసే అవకాశం ఉందని, ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు. అలాంటి కార్యక్రమాలపై గ్రామస్తులు సైతం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుచుకుంటూ దేశానికి సేవ చేసే విధంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మమ్మద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

భవిత స్కూల్‌కు విరాళం


దాతతో పాటు ఎంఈఓను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

డోన్: రోటరీక్లబ్ డోన్ శాఖ 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సమాజ సేవలో భాగంగా స్థానిక భవిత (దివ్యాంగుల) పాఠశాలలో మంచినీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు మార్లెల్ల రాజశేఖర్‌రెడ్డి రూ.20 వేల విరాళాన్ని ఎంఈఓ రఘునాయక్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, కార్యదర్శి బలరాంతో పాటు సభ్యులు రాజా విజయ్‌కుమార్, జగన్మోహన్, దశరథరామిరెడ్డి, మల్లారెడ్డి, సత్యసేనారెడ్డి, శంకర్‌గౌడ్, గౌండ షాలు, ఎల్ఐసి శంకర్ తదితరులు పాల్గొన్నారు. భవిత స్కూల్ ఉపాధ్యాయులు మధుబాబు, రాణి, మహాలక్ష్మిలు దాత రాజశేఖర్‌రెడ్డితో పాటు ఎంఈఓ రఘునాయక్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

నివాళి


నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పీఆర్ వెంకటేశ్వరరెడ్డి తల్లి పీఆర్ వెంకటసుబ్బమ్మ(97) మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తులసిరెడ్డి ఉన్నారు.

పింఛన్లు పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి సోమవారం లబ్ధిదారులకు పంఛన్లు పంపిణీ చేశారు. వికలాంగుల నిబంధనల పేరుతో నోటిసులు ఇచ్చారని, సదరం క్యాంపునకు వెళ్లితే 30 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు చూపించారని, భవిష్యత్తులో తొలగించకుండా చూడాలని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

జలదుర్గాన్ని మండల కేంద్రంగా మార్చాలని వినతి

డోన్: గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జలదుర్గం గ్రామాన్ని ప్యాపిలి మండల కేంద్రంగా ప్రకటిస్తానని సీఎం నారా చంద్రబాబునాయుడు మాట ఇచ్చి పట్టించుకోవడం లేదని.. వైఎస్సార్‌సీపీ, ఆవాజ్ కమిటీ కాంగ్రెస్, జనసేన, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నేతలు రసూల్, శ్రీనివాసులు, నాగరాజు, ఖాజా, చాకలి మధు, మహమ్మద్ హనీఫ్, ఓబయ్య, రాశిపోగుల నాగేశ్వరరావ్, హోటల్ జమాల్‌సాబ్, ఎస్ఎస్‌యూఐ నాయకులు విజయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. డోన్ నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు.



సీఐను సత్కరిస్తున్న గణేష్ కేంద్ర ఉత్సవ సమితి సభ్యులు,కమిషనర్, సిబ్బందిని సత్కరిస్తున్న సమితి సభ్యులు

అధికారులకు సత్కారం

బేతంచెర్ల: వినాయక చవితి ఉత్సవాలు విజయవంతం కావడంతో గణేష్ కేంద్ర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం అధికారులను సన్మానించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్, సిబ్బందిని సత్కరించారు. విజయవంతం కావడానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవ సమితి సభ్యులు హుసేన్‌రెడ్డి, మారుతీ కృష్ణ, మురళీకృష్ణ, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, హరి, నాగ మోహన్, మురళీ, జనార్దన్, మాణిక్యం, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌రావు, రాంబాబు, రాఘవ పాల్గొన్నారు.

బీమా వారోత్సవాలకు శ్రీకారం


ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న బీఎం

డోన్ టౌన్: ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగిన సంస్థలు మాత్రమే దీర్ఘకాలంగా నిలదొక్కుకుంటాయని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ అయ్యలన్న, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ అభిప్రాయపడ్డారు. జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 69వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి బీమా వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రత్యేక సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. పాలసీదారులకు అధిక బోనస్‌లు, క్లెయిమ్‌లను సకాలంలో చెల్లించడం సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా, పాలసీ ల్యాప్స్ అయిన వారికి వడ్డీ రాయితీతో పునరుద్ధరణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విశిష్ట సేవలందించిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో సోమవారం ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


పులికొండ గౌడ్(ఫైల్)

ప్యాపిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. అనంతపురం జిల్లా ఊటకల్లు గ్రామానికి చెందిన పులికొండ గౌడ్ (45) గత నెల 24న మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ప్యాపిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో పులికొండ గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పులికొండ గౌడ్‌ను చికిత్స నిమిత్తం కర్నూలులో ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య పుష్పావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుంతలతో ప్రమాదాల ముప్పు


ఆకుమల్ల గంగమ్మగుడి వద్ద సీసీ రోడ్డుపై గోతి


గుంతలో చేరిన వర్షపు నీరు

సంజామల: మండలంలోని ఆకుమల్ల గ్రామ ప్రధాన రహదారి గుంతలతో ఘోరంగా దెబ్బతింది. ఆకుమల్ల బస్టాండ్ వద్ద నుంచి సుంకేసుల రహదారి వరకు 2018లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హయాం ఈ రోడ్డు వేశారు. అయితే సీసీరోడ్డు నాసిరక పనుల వల్ల లోతైన గుంతలు ఏర్పడ్డాయి. అప్పట్లోనే ఈ రహదారి నాణ్యతపై చర్చ రేగిన సంగతి తెలిసిందే. ఆరు సంవత్సరాల్లోనే గంగమ్మ గుడి సమీపంలో రహదారిపై రెండు భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తాజాగా సుంకేసుల నుంచి కోవెలకుంట్ల వెళ్తున్న ఆటో ఆకుమల్ల వద్ద గుంతలో బోల్తా పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తామే మట్టితో గుంతలు పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వర్షాకాలంలో నీరు చేరడంతో మట్టికూడా కొట్టుకుపోతోంది. గుంతల ఆచూకీ తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

• వినాయకా.. మన్నించు..!


కుందూనదిలో తేలియాడుతున్న వినాయక విగ్రహాలు

వినాయక చవితి సందర్భంగా కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నెల 27న 47 మండపాల్లో గణనాథుల విగ్రహాలు ప్రతిష్ఠించగా, ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పట్టణ శివారులోని కుందూ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అయితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి భారీగా నీరు వదిలేయడంతో కొద్ది రోజులుగా కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు భద్రతా దృష్టితో నదిలోకి దిగి విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇవ్వకుండా, ట్రాక్టర్లపైనుంచే విగ్రహాలను నదిలోకి వేయించేలా ఏర్పాట్లు చేశారు. అయితే కొన్ని విగ్రహాలు భారీగా ఉండడంతో లోతు లేని ఒడ్డు ప్రాంతంలోనే పడిపోయింది. మోకాళ్ల లోతు నీరు మాత్రమే ఉండడంతో విగ్రహాలు పూర్తిగా మునిగిపోకుండా తేలాడుతుండడం చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కొందరు వ్యక్తులు నీటిలో ఉండే విగ్రహాల లోపలి ఇనుపకడ్డీలు, కర్రలు వంటి సామాగ్రిని తీసుకెళ్లారు. నీరు ఉన్నా నిమజ్జనానికి సరైన స్థలం లేకపోవడంతో ఏర్పడిన ఈ దురవస్థపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

–కోవెలకుంట్ల